సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



టమాట కిలో రూ.18
కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



క్వింటా మిర్చి రూ.21,500
హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం క్వింటా మిర్చి గరిష్టంగా రూ.21,500, కనిష్టంగా రూ. 7,000 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
36.6°/12.8°
జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

ఎంబీఏ, ఎంసీఏ ఫలితాలు విడుదల



జేఎన్‌టీయూ అనంతపురం పరీక్షల భవనం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఎంబీఏ, ఎంసీఏ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. డిసెంబర్, జనవరి నెలల్లో నిర్వహించిన ఎంసీఏ మూడో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంసీఏ మూడో సెమిస్టర్ (ఆర్–20), (ఆర్–17), నాలుగో సెమిస్టర్ (ఆర్–21), (ఆర్17), ఐదో సెమిస్టర్ (ఆర్–17) సప్లిమెంటరీ ఫలితాలు, ఎంబీఏ మూడో సెమిస్టర్ (ఆర్–17), నాలుగో సెమిస్టర్ (ఆర్–21), (ఆర్–17) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. పరీక్ష ఫలితాలు జేఎన్‌టీయూ వెబ్‌సైట్ చూడాలని కోరారు.

సిద్ధం సభను విజయవంతం చేద్దాం



పోస్టర్లు విడుదల చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పైలా నర్సింహయ్య తదితరులు

అనంతపురం కార్పొరేషన్: రాప్తాడులో ఈ నెల 11న జరిగే ఎన్నికల శంఖారావం 'సిద్ధం' సభను విజయవంతం చేద్దామని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పిలుపునిచ్చారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయ ఆవరణలో 'సిద్ధం' పోస్టర్లను ఆవిష్కరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా ఆదర్శవంతమైన పాలనను సీఎం జగన్ అందించారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. ప్రజలందరూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోను 99 శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా జగన్ నిలిచారన్నారు. పైలా నర్సింహయ్య మాట్లాడుతూ 'సిద్ధం' సభకు రాయలసీమలోని 49 నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వైఎస్సార్‌సీపీ కేడరంతా హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల రాష్ట్ర చైర్మన్లు హరీష్‌కుమార్ యాదవ్, ఎస్.రంగన్న, నదీం అహ్మద్, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్‌తో పాటు భారీగా వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

లాభాలకు లేదిక చింత

- రైతుల ఇంట సిరులు కురిపిస్తున్న చింత పండు
- మార్కెట్‌లో 'ఈ–నామ్' అమలుతో దళారీ వ్యవస్థకు చెక్
- చింత పండు పక్కకు తరలకుండా పకడ్బందీ చర్యలు



హిందూపురం మార్కెట్ యార్డులో విక్రయానికి తెచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: చింత చెట్లు రైతులకు లాభాలు కురిపిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే ప్రఖ్యాతిగాంచిన హిందూపురం మార్కెట్‌కు ఇబ్బడి ముబ్బడిగా చింత దిగుబడులు చేరుకుంటున్నాయి. ఏటా జనవరి నుంచి మే వరకూ ఇక్కడి మార్కెట్‌లో లక్ష క్వింటాళ్లకు పైగా చింతపండు క్రయవిక్రయాలు సాగుతాయి. ఈ ఏడాది ఈ–నామ్ విధానాన్ని అవలంబిస్తుండడంతో దళారుల బెడదకు చెక్ పడింది. రైతులు, వ్యాపారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా లావాదేవీలు కొనసాగిస్తున్నారు.

తరలివస్తున్న చింత పండు..
హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచే కాక పొరుగున ఉన్న కర్ణాటకలోని చెళ్లకెర, చింతామణి, బెంగళూరు ప్రాంతాల నుంచి చింతపండును విక్రయానికి రైతులు తీసుకువస్తున్నారు. ప్రతి సోమ, గురువారాల్లో జరిగే చింత పండు క్రయవిక్రయాలకు 20 వేల క్వింటాళ్ల చింత పండు వస్తోంది. మార్చిలో ఇది మరింత పెరిగే అవకాశముంది. సోమవారం ఏకంగా 20 లారీల చింతపండు మార్కెట్‌కు రాగా... ఇందులో కరిపులి (ప్రథమ శ్రేణి) రకం చింత పండు క్వింటా కనిష్టంగా రూ.8,020, గరిష్టంగా రూ.22 వేలతో అమ్ముడు పోయింది. సగటున రైతుకు రూ.16 వేల లాభం చేకూరింది. ఇక ద్వితీయ శ్రేణి ఫ్లవర్ రకం చింత పండు కనిష్టం రూ.4 వేలు, గరిష్టం రూ.10 వేలు చొప్పున సగటు రూ.6 వేలతో అమ్ముడుపోయింది. తృతీయ రకం 'బోటు' చింత రూ.3 వేలతో అమ్ముడు పోయింది.

మూడేళ్లలో హిందూపురం మార్కెట్ యార్డుకు వచ్చిన చింత పండు, క్రయవిక్రయాలు ఇలా..			
సంవత్సరం	చింత పండు	విలువ(రూ.లక్షల్లో)	మార్కెట్ ఫీజు (రూ.లక్షల్లో).
2020-21	66,613 క్వింటాళ్లు	రూ.6,259.47	రూ.62.59
2021-22	1,19,814 క్వింటాళ్లు	రూ.8,775.95	రూ.87.76
2022-23	1,14,410 క్వింటాళ్లు	రూ.9,230.53	రూ.92.31 (ఇప్పటి వరకూ)

అమలవుతున్న ఈ–నామ్..
రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ–నామ్ విధానాన్ని అమల్లోకి తీసుకు వచ్చాయి. దేశవ్యాప్త ఏకీకృత లైసెన్స్ జారీ చేయడం, ఎక్కడి నుంచైనా సరుకు కొనే వెసులుబాటు కల్పించడంతో హిందూపురం మార్కెట్‌లో ప్రస్తుతం ఈ–నామ్ పద్ధతిలో క్రయవిక్రయాలు చేపట్టారు. దీంతో రెండు వందల మందికి పైగా ట్రేడర్లు, కమీషన్ ఏజెంట్లు చింత పండు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. స్థానిక వ్యాపారులే కాక విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కడప, హైదరాబాద్, బెంగళూరు, కొచ్చి, చెన్నై ప్రాంతాల నుంచి భారీగా డిమాండ్ నెలకొంది.

శీతల గోదాముల్లో 600 లారీల చింత పండు నిల్వ..
హిందూపురంలోని శీతల గోదాముల్లో భారీ స్థాయిలో చింత పండు నిల్వలు ఉంచారు. ఇప్పుడిప్పుడే గిట్టుబాటు ధర పలుకుతుండటంతో గోదాముల్లోని చింతపండును మార్కెట్‌లకు తరలిస్తున్నారు. పట్టణ పరిధిలో ఎనిమిది శీతల గోదాముల్లో 600 లారీల (60,000) క్వింటాళ్ల చింత పండును నిల్వ చేశారు.

రైతుల నుంచి 4 శాతం కమీషన్..
మార్కెట్‌లో చింతపండు క్రయవిక్రయాల అనంతరం నగదు చెల్లింపు సమయంలో వ్యాపారులు, ఏజెంట్లు నాలుగు శాతం కమీషన్ వసూలు చేస్తున్నారు. నిబంధనల మేరకు రూ.2 వసూలు చేయాల్సి ఉన్నా... గతంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్‌గా అనూరాధ ఉన్న సమయంలో 4 శాతం కమీషన్ వసూలు చేసుకునే వెసలుబాటు కల్పించారు. అదే పద్ధతి ఇప్పటికీ కొనసాగుతుండటం గమనార్హం.

నిలకడగా ధరలు



మార్కెట్‌లో ఈ 15 రోజుల నుంచి క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పాత నిల్వలు 60 వేల క్వింటాళ్ల వరకూ ఉన్నాయి. మే వరకు లావాదేవీలు కొనసాగనున్నాయి.
– శ్రీకాంత్, హిందూపురం వ్యవసాయ మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షుడు

ధరలు ఫర్వాలేదు



కర్ణాటకలోని చెళ్లకెర మార్కెట్‌తో పోల్చుకుంటే హిందూపురం మార్కెట్‌లో ధరలు కొంచెం పర్వాలేదు. దీంతో మా ప్రాంతంలోని రైతులు ఇక్కడికే చింతపండు తీసుకొచ్చి విక్రయిస్తున్నాం. క్వింటా రూ.13వేలతో అమ్ముడు పోయింది.
– ఉమేష్, మల్లేహళ్లి, మధుగిరి తాలూకా, కర్ణాటక

సమన్వయంతో ముందుకు



పాలకవర్గం సహకారంతో రైతులు, వ్యాపారులను సమన్వయం చేసుకుని మార్కెట్లో చింతపండు క్రయవిక్రయాలు సజావుగా సాగిస్తున్నాం. ఈ సీజన్‌లో లక్ష క్వింటాళ్లకు పైగా సరుకు వస్తుందని అంచనా వేశాం. రైతులకు గిట్టుబాటు ధర కల్పించే నేపథ్యంలో బయట విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకున్నాం.
– జి. చంద్రమౌళి, మార్కెట్ యార్డు కార్యదర్శి, హిందూపురం

దుకాణాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

- కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ లక్ష్మీనరసయ్య
- ఈ నెల 29 లోపు పాత లైసెన్సుల రెన్యువల్



మాట్లాడుతున్న లక్ష్మీనరసయ్య, హాజరైన అధికారులు, వ్యాపార సంస్థల ప్రతినిధులు

అనంతపురం సిటీ: వాణిజ్య విధానాన్ని సులభతరం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఉమ్మడి జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ జి.లక్ష్మీనరసయ్య తెలిపారు. ఈ విధానం అమలులో భాగంగా దుకాణాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. ఇప్పటికే అనుమతులు పొందిన వారు ఈ నెల 29వ తేదీలోపు రెన్యువల్ చేసుకోవాలని, అనుమతి పొందని వారు వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణాల నిర్వహణ లైసెన్స్‌ల అంశంపై అధికారులు, వ్యాపార సంస్థల అసోసియేషన్ల ప్రతినిధులతో మంగళవారం అనంతపురంలోని కార్మిక శాఖ కార్యాలయంలో ఆయన సమావేశమై మాట్లాడారు. అన్ని దుకాణాలు, వ్యాపార సంస్థల వారు తప్పనిసరిగా తమ సంస్థలను రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. గతంలో మ్యాన్యువల్ విధానం కొనసాగేదని, ప్రస్తుతం మీ–సేవా కేంద్రాలు, సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి, సర్టిఫికెట్లు పొందాల్సిందేనని పేర్కొన్నారు. ఇది వరకే రిజిస్ట్రేషన్ చేయించిన వారు వాటిని రెన్యువల్ చేసుకుని సర్టిఫికెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమావేశంలో కార్మిక శాఖ సహాయ అధికారులు ఎం.సుజాత, రాధా రమాదేవి, జ్యువెలరీ అసోసియేషన్ ప్రతినిధి సయ్యద్, చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ రంగారెడ్డి, మర్చెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరత్నమయ్య, క్లాత్ అసోసియేషన్ అధ్యక్షుడు హితేన్ జైన్ పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రతపై దృష్టి సారించాలి



కదిరిలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు



ఎనుములపల్లి వ్యవసాయ గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఆర్డీఓ భాగ్యరేఖ

- ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి
- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం

పుట్టపర్తి అర్బన్/కదిరి టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో ఉపయోగించనున్న ఈవీఎంల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణతో కలిసి పుట్టపర్తి సమీపంలోని ఎనుములపల్లి వ్యవసాయ గోడౌన్‌ను, కదిరి ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలను సందర్శించారు. ఈవీఎంల భద్రతకు భవనాలు అనువుగా ఉన్నాయా..లేవా అని ఆరా తీశారు. అలాగే పోలీసు బందోబస్తు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలను భద్ర పరిచేందుకు జిల్లాలోని ఒక్కో నియోజకవర్గానికి సంబంధించి ఒక గోడౌన్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. అలాగే డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలను సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల కోసం గుర్తించిన భవనాల్లోనూ సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి, సెక్యూరిటీ సిబ్బందికి అవసరమయ్యే భవనాలను కూడా పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఐఓ లక్ష్మన్న, కదిరి మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, డీఎస్పీ శ్రీలత, తహసీల్దార్ సునీత తదితరులు పాల్గొన్నారు.

అరచేతిలో విజ్ఞానం.. భవితకు సోపానం

రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తోంది. పేద విద్యార్థులకు ఉన్నత చదువే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారు. మన బడి నాడు–నేడు కింద సర్కారు బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నారు. అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, గోరుముద్ద వంటి పథకాలతో ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నారు. దీంతో పాటు సాంకేతిక విద్యను చేరువ చేసేలా ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు అందజేసి.. బైజూస్ కంటెంట్‌తో పాఠాలను అందుబాటులోకి తెచ్చారు. వాటిని విద్యార్థులు చక్కగా వినియోగించుకుంటున్నారు. విజ్ఞానాన్ని సముపార్జించుకుని ఉన్నత భవితకు బాటలు వేసుకుంటున్నారు. అనంతపురం రాజేంద్ర నగర పాలక ఉన్నత పాఠశాల విద్యార్థులు ట్యాబ్‌లను ఉపయోగిస్తున్న దృశ్యాలివీ.
–సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ట్యాబ్‌ల వినియోగంలో సందేహాలు నివృత్తి చేస్తున్న దృశ్యం



బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లు వినియోగిస్తున్న విద్యార్థినులు

మాఘమాసం.. మంచి ముహూర్తం!

మాఘం...శుభ ముహూర్తాల మాసం. అందుకే అందరూ ఈ మాసం కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తుంటారు. ఈ నెల 11 నుంచి మాఘమాసం ప్రారంభం కానుండగా.. జిల్లాలో పెద్ద ఎత్తున పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కల్యాణ మంటపాల వద్ద సందడి కనిపిస్తోంది.

11 నుంచి ప్రారంభం కానున్న పెళ్లిళ్ల సీజన్

- ఏప్రిల్ 26 వరకు శుభ ముహూర్తాలు
- ఆ తర్వాత మళ్లీ ఆగస్టులోనే అవకాశం
- జిల్లాలో ఏకం కానున్న వందలాది జంటలు



హిందూపురం అర్బన్: వివాహం... ప్రతి ఒక్కరి జీవితంలో అపురూపమైన వేడుక. అందుకే కలకాలం గుర్తుండిపోయేలా చేసుకోవాలని అందరూ భావిస్తుంటారు. పిల్లల తల్లిదండ్రులైతే మంచి ముహూర్తంలో మూడుముళ్లు వేయించాలని భావిస్తుంటారు. అందుకోసం అవసరమైతే నెలల తరబడి వేచి చూస్తుంటారు. మిగతా మాసాలు ఎలా ఉన్నా మాఘమాసం మాత్రం మంచి ముహూర్తాలను మోసుకువస్తుంది. అందుకే అందరూ ఎదురుచూస్తుంటారు. ఈ నెల 11 నుంచి క్రోధనామ సంవత్సర చైత్రమాసం వరకు (ఏప్రిల్ 26) మూడు నెలల పాటు 30 మాత్రమే వివాహ ముహూర్తాలున్నాయి. తర్వాత శ్రావణ మాసం(ఆగస్టు)లోనే తిరిగి వివాహాలు జరుగుతాయని పండితులు చెబుతున్నారు.

అన్నింటికీ డిమాండ్..
ఈ మాఘ మాసంలో జిల్లా వ్యాప్తంగా వేలాది జంటలు ఒక్కటి కానున్నాయి. ఈ మేరకు ఆయా కుటుంబాలు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఈ నెల 13న మంచి ముహూర్తం ఉండటంతో జిల్లా వ్యాప్తంగా భారీగా స్థాయిలో వివాహాలు జరగనున్నాయి. సుమారు రెండు నెలల తరువాత మంచి ముహూర్తాలు వస్తుండటంతో ఇప్పటికే కల్యాణ మంటపాలన్నీ ఫుల్ అయ్యాయి. ప్రముఖ దేవాలయాల వద్ద పెళ్లి సందడి కనిపిస్తోంది. ఇక బంగారం, దుస్తుల దుకాణాలు కొనుగోళ్లతో కళకళలాడుతున్నాయి. పురోహితులు, కేటరింగ్, సన్నాయి మేళం, డెకరేషన్స్, సప్లయర్స్‌కు గిరాకీ పెరిగింది. ప్రధానంగా హిందూపురం, కదిరి, ధర్మవరం ఇలా ప్రధాన పట్టణాలతో పాటు, అక్కడి దేవాలయాల ప్రాంగణాల్లో ఎక్కువ పెళ్లిల్లు జరగనున్నాయి.

వివాహ సముహూర్తాలు ఇవే..
మాఘమాసం : ఫిబ్రవరి 13, 14, 17, 18, 24, 28, 29, మార్చి నెల 2, 3 తేదీలు.
పాల్గుణం: మార్చి 15, 17, 20, 22, 24, 25, 27, 28, 30 తేదీలు, ఏప్రిల్ 3, 4 తేదీలు.
చైత్రం: ఏప్రిల్ 9, 18, 19, 20, 21, 22, 24, 26 తేదీలు.

ఏప్రిల్ వరకూ ముహూర్తాలు




ఫిబ్రవరి 2 ఆదివారం మొదలు మంచి ముహూర్తాలు. కానీ మాఘమాసంలోనే ఎక్కువగా వివాహాలు జరుగుతాయి. మాఘమాసం ప్రారంభం నుంచి ఏప్రిల్ 26 వరకు మంచి ముహూర్తాలున్నాయి. అవి దాటితే మళ్లీ ఆగస్టులోనే. ఉపనయనాలు, వివాహాలు, గృహ ప్రవేశాలకు ఇదే మంచి తరుణం.
– సునీల్‌శర్మ, పండితులు, హిందూపురం.

లబ్‌డబ్ లయ తప్పుతోంది!

- ఇటీవల కాలంలో పెరిగిన గుండెపోట్లు
- వయో భేదం లేకుండా బాధితులు
- యాంత్రిక జీవనంలో తగ్గిన శారీరక శ్రమ
- జీవనశైలిలో మార్పుల కారణంగానే స్ట్రోక్
- వ్యాయామం తప్పనిసరిగా చేయాలంటున్న వైద్యులు

- పుట్టపర్తికి చెందిన 45 ఏళ్ల వ్యక్తి రెండు నెలల క్రితం గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే కుటుంబీకులు శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు అప్పటికప్పుడు ఆపరేషన్ చేసి బతికించారు.
- నెల రోజుల క్రితం 62 ఏళ్ల వృద్ధుడిని కుటుంబీకులు అనంతపురంలోని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు గుండెపోటుకు గురైనట్లు గుర్తించి వెంటనే వైద్యం చేయడంతో ప్రాణాలతో మిగిలాడు.
- నాలుగు నెలల క్రితం రామగిరి మండలానికి చెందిన ఓ మాజీ సైనికుడు గుండెపోటుకు గురయ్యాడు. అయితే ఆస్పత్రికి తరలించేలోపే అతను ప్రాణాలు కోల్పోయాడు.
- ఇటీవల ఓ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జిమ్‌లో వ్యాయామం చేస్తూ గుండెపోటుకు గురయ్యాడు. కాస్త ఆరోగ్య అవగాహన ఉన్న ఆయన..వెంటనే బంధువులకు ఫోన్ చేసి ఆస్పత్రికి చేరి చికిత్స చేయించుకున్నాడు.

..ఇలా ఇటీవల కాలంలో వయస్సుతో సంబంధం లేకుండా చాలామంది గుండెపోటు బారిన పడుతున్నారు. మారిన జీవన శైలి, ఆహార అలవాట్ల వల్లే గుండె లయ తప్పుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.



సాక్షి, పుట్టపర్తి

మన శరీరంలోని అవయవాల్లో గుండె ప్రధానమైనది. అంతటి ప్రాధాన్యం ఉన్న హృదయం ఆకస్మాత్తుగా లయ తప్పుతోంది. యాంత్రిక జీవనానికి అలవాటు పడిన మనిషి శారీరక శ్రమకు దూరమయ్యాడు. పైగా జంక్ ఫుడ్ అలవాటుపడ్డాడు. ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ఆందోళనకు గురవుతున్నాడు. ఫలితంగా చిన్నా, పెద్ద, ఆడ, మగ వయోభేదం లేకుండా ఎక్కువ మంది గుండెపోటు బారిన పడుతున్నారు. ఇటీవల గుండెపోటుతో మృత్యువాత పడుతున్న వారి సంఖ్య జిల్లాలో పెరుగుతోంది. సకాలంలో ఆస్పత్రికి చేరిన వారు మాత్రమే ప్రాణాలతో బయటపడుతున్నారు.

జీవనశైలిలో మార్పులతోనే..
కోవిడ్ అనంతరం గుండెపోటు ఘటనలు ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి. మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్లు, మద్యం తాగడం, మానసిన వేదన తదితర కారణాలతో గుండెపోటు వస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. అదేవిధంగా చాలా మంది ఫ్యాన్లు, ఏసీ గదుల్లో కూర్చుని కంప్యూటర్లపై ఉద్యోగం చేస్తున్నారు. శారీరక శ్రమ తగ్గిపోగా, మానసిక ఒత్తిళ్లు అధికమై గుండెపోటుకు గురవుతున్నారు.

మసాలా ఫుడ్ తోనూ..
వాకింగ్, శారీరక వ్యాయామం చేయకపోవడం కారణంగానూ కొందరు గుండెపోటు బారిన పడుతున్నారు. అదేవిధంగా మసాలాలతో తయారు చేసిన తిండితో పాటు మైదాతో తయారు చేసిన పిండి వంటకాలు, నూనెలో వేయించిన పదార్థాలు, రోడ్ల పక్కన, హోటళ్లలో మరిగిన నూనెలో చేసిన తిండ్లు, జంక్ ఫుడ్, బేకరీల్లో తయారు చేసిన పదార్థాలు తినడం ద్వారా కూడా గుండెపోటు వస్తుందని నిపుణులు చెబుతున్నారు.

పరీక్షలు చేయించుకోవాలి

గుండెపోటు రావడానికి అనేక కారణాలున్నాయి. ఏదైనా ఆరోగ్య సమస్య ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి. శారీరక వ్యాయామం తప్పనిసరి. మానసిక ఒత్తిళ్లను అధిగమించాలి.
– ఎస్‌వీ కృష్ణారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

క్లుప్తంగా

76 పట్టు చీరల సీజ్

చిలమత్తూరు: మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై కొడికొండ చెక్‌పోస్టును దాటుకుని జిల్లాలోకి తీసుకువస్తున్న 76 పట్టు చీరలను సేల్స్ ట్యాక్స్ అధికారులు సీజ్ చేశారు. సేల్స్ ట్యాక్స్ అధికారులు కొడికొండ చెక్‌పోస్టులో మంగళవారం ఉదయం సాధారణ తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో బెంగళూరు నుంచి గద్వాల్‌కు పట్టు చీరలు తరలిస్తున్న విషయం గుర్తించారు. చీరలు తరలిస్తున్న ఇద్దరి వద్ద ఎలాంటి బిల్లులు, జీఎస్టీ చెల్లింపులకు సంబంధించిన రసీదులు లేవు. దీంతో రూ.5.90 లక్షలు విలువ చేసే చీరలను సీజ్ చేశారు.

వ్యవసాయాధికారుల సంఘం డైరీ ఆవిష్కరణ



డైరీలు ఆవిష్కరిస్తున్న డీఏఓ సుబ్బారావు

పుట్టపర్తి అర్బన్: ఉమ్మడి జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన డైరీలను జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక జిల్లా వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌నాయక్, జనరల్ సెక్రెటరీ రియాజ్, ట్రెజరర్ దాక్షాయణి, రాష్ట్ర సభ్యులు చక్రపాణి, ఉపేంద్రరెడ్డి సునీత, చంద్రకళ, మారుతమ్మ, బొప్పరాజు, రంగాచారి, అంజాద్, రాఘవేంద్రరెడ్డి, పలువురు విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

హోంగార్డు దుర్మరణం



మృతుడు నాగప్ప (ఫైల్)

కనగానపల్లి: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ హోంగార్డు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన నాగప్ప (40) కనగానపల్లి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నారు. సోమవారం తూంచర్ల గ్రామంలో జరుగుతున్న ఊరు దేవర కార్యక్రమానికి బందోబస్తు విధుల్లో పాలుపంచుకున్నాడు. మంగళవారం తెల్లవారుజామున విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై తగరకుంట మీదుగా కనగానపల్లికి బయలుదేరాడు యలకుంట్ల క్రాస్ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా ధర్మవరం నుంచి వేపకుంటకు వెళుతున్న ఆర్టీసీ డ్రైవర్ బస్సు ఎద్దుల బండిని తప్పించబోయి నాగప్ప ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఘటనలో బస్సు కిందపడిన నాగప్ప తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కనగానపల్లి ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనపై కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. కాగా, మృతుడికి భార్య యశోద, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఆదమరిస్తే బ్యాంక్ ఖాతా ఖాళీ!

- సైబర్ నేరగాళ్ల సరికొత్త పంథా
- వేలిముద్రలతో సొమ్ము కాజేస్తున్న వైనం
- ఇప్పటి వరకూ బాధితుల ఖాతా నుంచి రూ.2,16,26,472 అపహరణ
- వేలిముద్రలను రూపకల్పన చేసే సాంకేతికతతో ఖాతాల లూటీ



అనంతపురం: ఆధునాతన టెక్నాలజీని ఉపయోగించుకుని ప్రజల సొమ్మును అడ్డగోలుగా దోచేస్తున్నారు. ఏ మాత్రం ఆదమరిచినా బ్యాంక్ ఖాతాలను లూటీ చేసేస్తున్నారు. జిల్లాలో ఇటీవల ఈ తరహా నేరాలు పెచ్చుమీరాయి. బ్యాంక్ ఖాతాల్లోని సొమ్ము తమకు తెలియకుండానే మాయమై పోతుండడంతో పలువురు ఖాతాదారులు గగ్గోలు పెడుతున్నారు. ఈ క్రమంలోనే సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పదేపదే జిల్లా పోలీసు యంత్రాంగం హెచ్చరిస్తున్నా... ఎక్కడో ఓ చోట బాధితులు వెలుగులోకి వస్తూనే ఉన్నారు.

సైబర్ నేరాల్లో మచ్చుకు కొన్ని..

- నిరుద్యోగ యువత, అమాయక ప్రజల కష్టార్జితాన్ని క్రిప్టో కరెన్సీ రూపంలోకి మార్చి విదేశాలకు తరలిస్తున్న సైబర్ క్రైం కింగ్‌పిన్ అనయతుల్లా ఖాన్ అలియాస్ ఫర్హాన్‌ను జమ్మూ కాశ్మీర్‌లో గతేడాది డిసెంబర్‌లో అనంత పోలీసులు అరెస్ట్ చేశారు.
- వివిధ ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారుల పేరుతో ఫేక్‌కాల్, మెసెజ్‌లతో సైబర్ నేరాలకు ఒడిగడుతున్న రాజస్తాన్‌కు చెందిన కీలక నిందితుడు రిజ్వాన్‌ను అనంతపురం వన్‌టౌన్ పోలీసులు జనవరి రెండో వారంలో అరెస్ట్ చేశారు. మహిళల ఫొటోలను ప్రొఫైల్ పిక్‌గా పెట్టుకుని వాట్సాప్ చాటింగ్‌ల ద్వారా పరిచయం పెంచుకునే వాడు. ఆ తర్వాత న్యూడ్ వీడియోలు పంపి అవతలి వ్యక్తుల వీడియో ఫొటోలను సేకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ డబ్బు డిమాండ్ చేసేవాడు. ఇదే తరహా కేసులో కొయంబత్తూరుకు చెందిన విజయలక్ష్మినీ పోలీసులు గతంలో అరెస్ట్ చేశారు.
- కొరియర్ సర్వీసు పేరుతో మోసాలకు పాల్పడిన ఇద్దరు ఉత్తరప్రదేశ్ వాసులపై వారం రోజుల క్రితం అనంత పోలీసులు చర్యలు చేపట్టారు.

నకిలీ వేలిముద్రలతో నగదు అపహరణ

ఇటీవల వేలిముద్రల తరహాలోనే నకిలీవి రూపకల్పన చేసి ప్రజల సొమ్మును కాజేస్తున్న సైబర్ నేరగాళ్ల ఆటను అనంతపురం పోలీసులు కట్టడి చేశారు. దేశంలో ఏ మూల దాక్కున్నా వెతికి పట్టుకు వచ్చి ప్రజల సొమ్ము రికవరీ చేసిస్తున్నారు. ఇటీవల బిహార్‌లో మకాం వేసిన సైబర్ నేరగాళ్లను గుర్తించిన ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తక్షణమే స్పందించారు. ఆయన ఆదేశాలతో బిహార్‌కు వెళ్లిన అనంత పోలీసులు పలువురిని అరెస్ట్ చేసి, అనంతకు పట్టుకువచ్చారు. వీరు రిజిస్ట్రేషన్ కార్యాలయాల వెబ్‌సైట్‌ల ద్వారా డాక్యుమెంట్లలోని వేలిముద్రలు, ఆధార్ కార్డుల నకళ్లను డౌన్‌లోడ్ చేసుకునేవారు. అనంతరం కొన్ని రకాల రసాయనాలు వినియోగించి అసలు వేలిముద్రలను పోలిన నకిలీవి సిద్ధం చేసి, ఆధార్ ఎనబుల్డ్ పేమెంట్ సిస్టమ్ (ఏపీఈఎస్) ద్వారా డాక్యుమెంట్లలోని వేలిముద్రల సంబంధీకుడి బ్యాంక్ ఖాతా నుంచి నగదు అపహరించేవారు. ఈ ముఠాలో నూర్ ఇస్లాం, మహమ్మద్ ఇస్రాఫిల్ పట్టుబడగా... బబ్బుద్దీన్ పరారీలో ఉన్నాడు. ఈ ముగ్గురూ తాము కాజేసిన సొమ్మును సమానంగా పంచుకున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. మూడు నెలల వ్యవధిలో ఈ ముఠా సభ్యులు 300 మంది బ్యాంకు ఖాతాల నుంచి రూ.39,48,304 కాజేసినట్లు పోలీసులు గుర్తించారు. గత 13 నెలలుగా ఎన్‌సీఆర్‌పీ, 1930 నంబర్లకు జిల్లా నుంచి 1484 ఫిర్యాదులు అందాయి. ప్రజల ఖాతాల నుంచి మొత్తం రూ.2,16,26,472 మాయం చేసినట్లుగా ఫిర్యాదుల ద్వారా వెల్లడవుతోంది. ఇందులో ఇప్పటి వరకూ రూ. 1,50,25,967 నగదును తిరిగి బాధితుల ఖాతాల్లోకి సైబర్ క్రైం పోలీసులు జమ చేయించారు. మిగితా సొమ్ము రికవరీపై దృష్టి సారించారు. ఈ క్రమంలో జమ్మూకాశ్మీర్, తమిళనాడు, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్‌లలో దాక్కున్న సైబర్ నేరగాళ్లను ఇది వరకే అనంత పోలీసులు పట్టుకున్నారు. తాజాగా బిహార్‌కు చెందిన ఇద్దరు సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేయడం విశేషం.

అప్రమత్తంగా ఉండాలి

ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, వేలిముద్రలను వివిధ మార్గాల ద్వారా సేకరించి వాటి ఆధారంగా ప్రజల బ్యాంక్‌ల ఖాతా నుంచి డబ్బు దోచేస్తున్న ముఠా చర్యలపై అప్రమత్తంగా ఉండాలి. ఏపీఈఎస్‌పై ప్రజల్లో చైతన్యం అవసరం. వ్యక్తిగత సమాచారంతో పాటు వేలిముద్రలను తరుచుగా సమాచారం నిమిత్తం ఎవరికైనా ఇస్తే బ్యాంకు ఖాతా ఖాళీ అయ్యే ప్రమాదముంది. గ్రామీణ ప్రాంతాల్లో ఏటీఎం సౌకర్యం లేని ప్రాంతాల్లో ఏఈపీఎస్ విత్ డ్రా సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. ఈ రకంగా నగదును రూ.10 వేల లోపు డ్రా చేసుకునే వెసులుబాటు ఉంది. ఈ నేపథ్యంలో వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుకోవాలి.

– కేకేఎన్ అన్బురాజన్, అనంత ఎస్పీ

రాప్తాడు రహదారిలో రాకపోకలు బంద్

అనంతపురం: పంగల్ రోడ్డు – రాప్తాడు మార్గంలోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా ఆ మార్గంలో బుధ, గురువారం వాహనాల రాకపోకలు నిలిపివేస్తున్నట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ బీవీ శివారెడ్డి మంగళవారం తెలిపారు. ప్రజలు సహకరించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని కోరారు. కదిరి రోడ్డు నుంచి పంగల్ రోడ్డు, రాప్తాడు మీదుగా 44వ జాతీయ రహదారి పైకి చేరుకునే వాహనాలు ఇకపై అనంతపురం నగరం మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు. హైదరాబాద్ నుంచి రాప్తాడు, పంగల్ రోడ్డు మీదుగా కదిరికి వెళ్లే వాహనాలు అనంతపురం ద్వారా పంగల్ రోడ్డు, కదిరి వైపు వెళ్లాల్సి ఉంటుందన్నారు. భారీ వాహనాలు అనంతపురం నగరంలోకి అనుమతించబడవన్నారు. ప్రత్యామ్నాయంగా కదిరి వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు కలెక్టరేట్ ఎదురుగా ఉన్న చెరువుకట్ట పైనుంచి ఎన్టీఆర్ మార్గ్, గుత్తిరోడ్డు, తడకలేరు మీదుగా సోములదొడ్డి వద్ద 44వ జాతీయ రహదారిపైకి చేరుకునేలా మళ్లించినట్లు వివరించారు. హైదరాబాద్ నుంచి కదిరి, చెన్నై వైపు వెళ్లే భారీ వాహనాలు సోములదొడ్డి, గుత్తి రోడ్డు, ఎన్టీఆర్‌మార్గ్, చెరువు కట్ట, కలెక్టరేట్, పంగల్‌రోడ్డు, ఆకుతోటపల్లి మీదుగా వెళ్లాల్సి ఉంటుందన్నారు.

బస్సు రూట్ల మళ్లింపు

అనంతపురం సెంట్రల్: రాప్తాడు రైల్వే గేటు వద్ద సర్వీసు రోడ్డు మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల రూట్లను మళ్లించినట్లు జిల్లా ప్రజారవాణాధికారి సుమంత్.ఆర్.ఆదోని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాప్తాడు మీదుగా వెళ్లే బస్సు సర్వీసులు (బెంగళూరు, పెనుకొండ, మడకశిర, హిందూపురం, బండమీదపల్లి) టవర్‌క్లాక్ మీదుగా 44వ జాతీయ రహదారి వైపు మళ్లించారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గుర్తించాలని డీపీటీఓ కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించండి



అధికారులు, రాజకీయపార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌కుమార్

- జేసీ అభిషేక్‌కుమార్

హిందూపురం: పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను జేసీ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం హిందూపురానికి విచ్చేసిన ఆయన పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని 40 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో ఫర్నిచర్, విద్యుత్, ర్యాంప్ సదుపాయం, మరుగుదొడ్లు తదితర వసతులపై ఆరా తీశారు. అనంతరం పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. సమస్యలుంటే ముందుగా తెలియజేస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. కేంద్రాల్లో చేపట్టాల్సిన మరమ్మతులు, కల్పించాల్సిన సదుపాయాలను వివరించారు. నాడు – నేడు కింద చేపట్టిన పనుల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని వారం లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా పోలింగ్ స్టేషన్‌లో పరిధిలోని బీఎల్‌ఓలతో వారంలో ఒకసారి తప్పనిసరిగా సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించాలని సెక్టర్ ఆఫీసర్లకు సూచించారు. అనంతరం ఈవీఎంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, తహసీల్దార్లు శివప్రసాద రెడ్డి, బాలనరసింహులు, భాగ్యలత, ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి, సిరికల్చర్ ఏడీ సురేష్, డిప్యూటీ తహసీల్దార్ రెడ్డి శేఖర్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలపండి..

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే వెంటనే తెలపాలని రాజకీయ పార్టీల నాయకులకు జేసీ అభిషేక్‌కుమార్ సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఇప్పటికే బీఎల్‌ఓలు అన్ని పరిశీలించి ఓటరు జాబితాను సిద్ధం చేశారని గుర్తు చేశారు. ఇందులో ఏవైనా అభ్యంతరాలుంటే తెలపాలన్నారు.

సేవాగఢ్‌లో ఏర్పాట్లపై సమీక్ష



మాట్లాడుతున్న డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు

గుత్తి రూరల్: ఈ నెల 13, 14, 15 తేదీల్లో జరగనున్న సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గుత్తి మండలం చెర్లోపల్లి పంచాయతీ సేవాగఢ్‌లో చేపట్టిన ఏర్పాట్లపై అధికారులు మంగళవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సేవాగఢ్‌లోని టీటీడీ కల్యాణ మంటపం వేదికగా జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సేవాగఢ్ ట్రస్ట్ అధ్యక్షుడు కొర్రా జగన్నాథ్‌నాయక్, ఉపాధ్యక్షుడు కేశవనాయక్, ప్రధాన కార్యదర్శి అశ్వత్థనాయక్, గుత్తి, గుంతకల్లు మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి బంజారాసంఘం ప్రముఖులు హాజరు కానున్న నేపథ్యంలో ఉత్సవాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, 14, 15 తేదీల్లో ఆలయ పరిసరాలు శుభ్రంగా ఉంచే అంశంపై ప్రత్యేకంగా చర్చించారు. గుత్తి, గుంతకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజారవాణా విభాగం అధికారులకు సూచించారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఉత్సవాలు జరిగే మూడు రోజులూ సమీప గ్రామాల్లో నాటుసారా, మద్యం అమ్మకాలు జరగకుండా చూడాలని సెబ్ అధికారులకు సూచించారు. తాగునీటి సౌకర్యం, తాత్కాలిక స్నానపు గదులు, మరుగుదొడ్ల ఏర్పాటుపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించారు. అన్ని శాఖల అధికారులందరూ మూడు రోజుల పాటు సేవాగఢ్‌లోనే ఉండాలని తీర్మానించారు. సమావేశంలో సర్పంచ్ అప్పా వెంకటేష్, ట్రస్ట్ సభ్యులు రవీంద్రనాయక్, రామచంద్రనాయక్, సుబ్రహ్మణ్యం నాయక్, సీఐ వెంకట్రామిరెడ్డి, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, డీటీ లలిత, విద్యుత్ ఏఈ శ్రీకుమార్, సీడీపీఓ దిల్లేశ్వరి పాల్గొన్నారు

యువకుడి ఆత్మహత్య



రంజిత్‌కుమార్ (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: ప్రేమించిన యువతితో పెళ్లికి నిరాకరించడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పుట్టపర్తి మండలం వీరాంజనేయపల్లికి చెందిన నారాయణ, శంకరమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు రంజిత్‌కుమార్(29) అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. వీరి పెళ్లికి యువతి తరఫు కుటుంబపెద్దలు నిరాకరించారు. దీంతో మనస్తాపం చెందిన రంజిత్‌కుమార్ ఇటీవల నిర్మించి ప్రారంభం కాని నూతన భవనంలో సోమవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం ఎంత సేపటికీ ఇంటికి చేరుకోకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు నూతన ఇంటి వద్దకెళ్లి పరిశీలించారు. తలుపులు తీయకపోవడంతో స్థానికుల సహకారంతో బద్దలుగొట్టి లోపలకు వెళ్లారు. అప్పటికే విగత జీవిగా ఉరికి వేలాడుతున్న కుమారుడిని చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న పుట్టపర్తి రూరల్ ఎస్‌ఐ కృష్ణమూర్తి అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కులవృత్తులకు పూర్వ వైభవం



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి

- జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి
- జిల్లాలో 18 రకాల కుల వృత్తుల గుర్తింపు
- వృత్తిదారులందరికీ ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం వర్తింపు
- రూ.3 లక్షల వరకు రుణ సదుపాయం

అనంతపురం సిటీ: అంతరించిపోతున్న కుల వృత్తులకు మళ్లీ జీవం పోయాలన్న సంకల్పంతో ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా చైతన్యం తీసుకురావాలని సంబంధిత అధికారులను జిల్లా పరిషత్ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి ఆదేశించారు. అనంతపురంలోని జెడ్పీ కాంపౌండ్‌లో గల డీపీఆర్‌సీ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో గుర్తించిన 18 రకాల కుల వృత్తిదారులకు ఆర్థికంగా రుణ వసతి కల్పించి, వృత్తులకు తిరిగి పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. విశ్వకర్మ పథకం కింద ఒక్కొక్కరికి రూ.3 లక్షల వరకూ రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. ఇందుకు కేవలం 5 శాతం వడ్డీ మాత్రమే వసూలు చేస్తారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ పథకం లబ్ధి చేకూరుస్తామన్నారు. విశ్వకర్మ పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం రూ.13 వేల కోట్లు కార్పస్‌ఫండ్ ఏర్పాటు చేసిందని ఎంఎస్‌ఎంఈడీఐ అసిస్టెంట్ డైరెక్టర్ డీవీఎస్ఆర్ మూర్తి తెలిపారు. 2028వ సంవత్సరం వరకూ ఈ పథకం కొనసాగుతుందని ప్రకటించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం విధివిధానాలను జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజారావు వివరించారు. ఈ పథకం కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి రెండో దశ నుంచి మూడో దశకు సిఫారసు చేయనున్నట్లు తెలిపారు. విశ్వకర్మ పథకం కోసం వచ్చే దరఖాస్తులను జాప్యం లేకుండా పరిశీలించాలని సర్పంచులకు డీపీఓ ప్రభాకర్‌రావు సూచించారు. మహిళలకు నైపుణ్యాలు పెంపొందించి ఈ పథకం ద్వారా లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంటామని డీఎల్‌డీఓ చిలంకూరు ఓబుళమ్మ తెలిపారు. దరఖాస్తుకు సంబంధించిన అనుమానాలను సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సీఎస్‌సీ జిల్లా మేనేజర్ కృష్ణ సాగర్ తెలిపారు. బ్యాంకర్లు, జిల్లా పరిశ్రమల శాఖ ఉద్యోగులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



రామకృష్ణారెడ్డి మృతదేహం

ధర్మవరం అర్బన్: వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని బసవన్నకట్టవీధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. బసవన్నకట్టవీధికి చెందిన రామకృష్ణారెడ్డి (38) స్థానిక రైల్వేస్టేషన్‌లో వడలు, చిరుతిండ్లు విక్రయిస్తూ జీవించేవాడు. మంగళవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య షాహీనా, ఒక కుమార్తె ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధి పనుల్లో పారదర్శకత పాటించాలి

- డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్




సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ తదితరులు

మడకశిర: ఉపాధి పనుల్లో పారదర్శకత పాటించాలని డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో జరిగిన వివిధ ఉపాధి పనులపై క్షేత్ర స్థాయిలో చేసిన తనిఖీ వివరాలను వెల్లడించారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు, వేతన దారులు తదితరులు పాల్గొన్నారు. పీడీ మాట్లాడుతూ.. నిబంధనల మేరకు పనులు చేయని వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. అక్రమాలు, అవినీతి జరిగి ఉంటే రికవరీ చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఏపీడీ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ డీవీఓ నాగేశ్వరావు, ఎంపీడీఓ దాసరి మేరి, ఏపీఓ శ్రీకాంత్‌గౌడ్, వైస్ ఎంపీపీ మూర్తి, సర్పంచులు, ఎంపీటీసీలు, టీఏలు, ఎఫ్ఏలు, కూలీలు పాల్గొన్నారు.



సాలె గూడుపై మంచు బిందువులు



ఎండిన మొక్కకు కొత్త అందం

ముత్యమై మెరిసే...

తెల్లవారుజామున వాతావరణం ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. ఎక్కడికక్కడ కురిసిన మంచుతో చెట్లు, మొక్కలు, పూలు, ఆకులు, పచ్చటి గడ్డి కొత్త అందాలను సంతరించుకుంటున్నాయి. పట్టణాలు, నగరాల్లో అయితే అంతగా కనిపించవు కానీ... గ్రామాల్లో గడ్డి, ఇతర మొక్కలపై ఉన్న సాలె గూడుపై పడిన మంచు... నీటి బిందువులుగా మారి ముత్యాలను తలపిస్తుండడం చూడగానే మనసుకు ఎంతో ఉల్లాసంగా అనిపిస్తుంది. ఇంతటి అపురూప దృశ్యాలు ఆదివారం తెల్లవారు జామున పుట్టపర్తి సమీపంలోని చిత్రావతి నది ఒడ్డున పర్యాటకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

– పుట్టపర్తి రూరల్:



ముత్యాల హారాన్ని తలపిస్తున్న హిమసోయగం